సాక్షి ఒడిశా

శుక్రవారం । 10 । మే । 2024



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం గురువారం లెక్కించారు. ఇందులో నగదు రూ.3,07,895లు, బంగారం 200 మిల్లీగ్రాములు, వెండి 6 గ్రాముల 500 మిల్లీగ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.

విభిన్న సంస్కృతుల సంగమం.. ఉమ్మరకోట్ సొంతం!



ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర సరిహద్దులో నక్సల్ ప్రభావిత నవరంగపూర్ జిల్లాలో ఉన్న ఉమ్మరకోట్ అసెంబ్లీ స్థానానికి ప్రత్యేక స్థానం ఉంది.

- 8లో



నేడు ప్రధానమంత్రి రోడ్ షో

ప్రధానమంత్రి నరేంద్రమోదీ రెండు రోజుల పర్యటన కోసం శుక్రవారం మరోసారి రాష్ట్రానికి రానున్నారు.

- 8లో

న్యూస్‌రీల్

3 క్వింటాళ్ల గంజాయి స్వాధీనం



మంత్రిఅంబ సమీప అడవిలో పట్టుబడిన గంజాయి

జయపురం: జయపురం **సబ్‌డివిజన్ బొయి**పరిగుడ పోలీసులు 3 క్వింటా**ళ్ల 10 కేజీల గం**జాయిని పట్టుకున్నారు. గంజాయిని దొంగతనంగా ఇతర ప్రాంతాలకు తరలించే లక్ష్యంతో మాఫియా అడవిలో దాచినట్లు పోలీసులు అనుమానం వ్యక్తం చేశారు. బుధవారం సాయంత్రం విశ్వాసనీయ వర్గాల ద్వారా సమాచారం అందటంతో బొయిపరిగుడ పోలీసు అధికారి దీపాంజళీ ప్రధాన్ ఆదేశం మేరకు.. సబ్ ఇన్‌స్పెక్టర్ అనిత నాయిక్ నేతృత్వంలో పోలీస్ టీమ్ బొయిపరిగుడ సమితి మంత్రిఅంబ సమీప గొలారిగుడ గ్రామంపై దాడి జరిపారు. పోలీసులు వస్తున్నారని ముందుగా తెలిసిన గంజాయి మాఫియా గంజాయి బస్తాలను సమీప అడవిలో దాచివేసి పరారయ్యారు. పోలీసులు అడవిలో కూడా గాలించగా దాచిన గంజాయి బస్తాలు గుర్తించారు. గంజాయి బస్తాలను బొయిపరిగుడ పోలీసు స్టేషన్‌కు గురువారం తీసుకువచ్చి తూకం వేసినట్లు పోలీసు అధికారి దీపాంజళి ప్రధాన్ వెల్లడించారు.

బీజేడీతోనే మహిళా సాధికారత



బీజేడీ అభ్యర్థులతో మహిళా నేతలు

జయపురం: మిషన్ శక్తి ద్వారా మహిళా సాధికారతకు సీఎం నవీన పట్నాయక్ నేతృత్వంలో బీజేడీ ప్రభుత్వం గత 24 ఏళ్లుగా పలు పథకాలు అమలు చేస్తున్న విషయం అందరికీ తెలిసిందేనని రాష్ట్ర బీజేడీ మహిళా నాయకురాలు మీరా పారిడ అన్నారు. జయపురం విధానసభ నియోజకవర్గంలో బొరిగుమ్మ సమితి కుములి బీజేడీ నిర్వహించిన మహిళా సమారోహంలో మీరా పారిడ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. బీజేడీ ప్రభుత్వం మహిళల కోసం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న విషయం అందరికీ తెలిసిందేనన్నారు. రాష్ట్ర ప్రగతి, మహిళా సంక్షేమమే ప్రధాన లక్ష్యంగా పని చేస్తున్న నవీన పట్నాయక్ మరోసారి ముఖ్యమంత్రి కావాలని, అందరూ శంఖం గుర్తుపై ఓటు వేసి బీజేడీ అభ్యర్థులను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఆ పార్టీ మహిళా కార్యకర్తలతో కలిసి ర్యాలీ నిర్వహించారు. కుములి సంత తోట నుంచి ప్రారంభమైన ర్యాలీ దుర్గా మండపానికి చేరింది. ఈ సమావేశంలో జయపురం నియోజకవర్గంలో బీజేడీ అభ్యర్థి డాక్టర్ ఇందిరా నందో, కొరాపుట్ లోక్ సభ నియోజకవర్గంలో బీజేడీ అభ్యర్థి కౌశల్య హికాక, జిల్లా బీజేడీ మహిళా విభాగ అధ్యక్షురాలు తులసీ కిరసానితోపాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి వేలాది మంది మహిళలు పాల్గొన్నారు.

డబుల్ ఇంజిన్ సర్కారుతో అభివృద్ధి

- బీజేడీ పాలనలో రాష్ట్రం అధోగతి
- ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి విష్ణుదేవ్ సాయ్




మాట్లాడుతున్న ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి విష్ణుదేవ్ సాయ్

జయపురం: కొట్‌పాడ్ విధానసభ నియోజకవర్గం కుంద్రాలో బీజేపీ విజయ సంకల్ప సమావేశం గురువారం నిర్వహించారు. శాస్త్రి మైదానంలో జరిగిన ఈ సంకల్ప సమావేశానికి ఛత్తిగఘడ్ సీఎం విష్ణుదేవ్ సాయ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొట్‌పాడ్ నియోజకవర్గంలో కార్మికులకు పనులు లభించకపోవటంతో ఇతర రాష్ట్రాలకు వలసపోతున్నారని ఆరోపించారు. రైతుల పట్ల రాష్ట్ర ప్రభుత్వం సవతి తల్లి ప్రేమ ఒలక బోస్తుందని దుయ్యబట్టారు. బీజేడీ తన 25 ఏళ్ల పాలనలో రైతుల పంట భూములకు సాగునీరు సమకూర్చలేదని విమర్శించారు. రాష్ట్రంలో డబుల్ ఇంజన్ సర్కార్ ఏర్పడితే అభివృద్ధి పథంలో అడుగులు వేస్తుందన్నారు. బీజేపీ అభ్యర్థులకు ఓటు వేసి గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో నవరంగపూర్ లోక్ సభ నియోజకవర్గం బీజేపీ అభ్యర్థి బలభద్ర మఝి, కొట్‌పాడ్ బీజేపీ అభ్యర్థి రుపు భొత్ర, బీజేపీ జిల్లా అధ్యక్షుడు సుమంత ప్రధాన్, ఛత్తిషగడ్ మాజీ ముఖ్యమంత్రి, మాజీ ఎంపీలు, మాజీ ఎమ్మెల్యేలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చందన యాత్ర .. చూద్దాం రండి..!



చందన యాత్రకు సిద్ధమవుతున్న నరేంద్ర సరోవరం



నరేంద్ర సరోవరం నుంచి నావలను బయటకు తీస్తున్న భోయి సేవకులు

- నేడు అక్షయ తృతీయ
- ప్రారంభమవ్వనున్న శ్రీజగన్నాథుని చందన యాత్ర
- నేటి నుంచి రథ నిర్మాణాలకు శ్రీకారం

భువనేశ్వర్: పూరీ శ్రీజగన్నాథుని వార్షిక రథయాత్ర ఎంతో ప్రసిద్ధి చెందింది. ఈ యాత్ర కోసం 3 కొత్త రథాల నిర్మాణం ఏటా అక్షయ తృతీయ తిథి పురస్కరించుకుని ప్రారంభించడం ఆచారం. అదే రోజున స్వామివారి చందన యాత్ర ప్రారంభమవుతుంది. పూరి నరేంద్ర సరోవరంలో స్వామి నావికా విహారం చేయడం చందన యాత్ర విశిష్టత. ఈ యాత్ర రెండు విడతల్లో జరుగుతుంది. సమగ్రంగా 42 రోజులు కొనసాగుతుంది. తొలి 21 రోజులు వెలుపల చందన యాత్ర, మిగిలిన 21 రోజుల లోపలి చందన యాత్రగా నిర్వహిస్తారు. ఈ మేరకు సన్నాహాలు తుది మెరుగులు దిద్దుకుంటున్నాయి. శ్రీమందిరం కార్యాలయం ఆవరణలో కొత్త రథాల నిర్మాణ శాల సిద్ధమవుతోంది. ఈ ప్రాంగణానికి విడతలవారీగా దుంగలు చేరాయి.

నరేంద్ర సరోవరం ముస్తాబు

పవిత్ర చందన యాత్ర పురస్కరించుకుని నరేంద్ర సరోవరం ముస్తాబు అవుతోంది. మరోవైపు సరోవరంలో ముంచి ఉంచిన నావలను సురక్షితంగా వెలుపలకు తీసి కొత్తగా రంగులు అద్ది శోభాయమానంగా తీర్చిదిద్దుతున్నారు. చందన వేదిక ఆకర్షణీయమైన రంగుల కళతో రూపుదిద్దుకుంటుంది. ఏడాది పొడవునా నరేంద్ర సరోవరంలో మునిగి ఉన్న భద్ర, నంద, వైజయంతి నావలను భోయి వర్గం సేవకులు బయటకు తీసి, ఈ ఏడాది చందన యాత్రకు సిద్ధం చేస్తున్నారు. ఈ నావలపై ఉత్సవ మూర్తులు అక్షయ తృతీయ మొదలుకొని 21 రోజులపాటు నిరవధికంగా నావికా విహారం చేస్తారు. ఈ సందర్భంగా నిత్యం సంధ్య వేళలో శ్రీమందిరం నుంచి పల్లకిలో బయటకు వచ్చిన ఉత్సవమూర్తులు బొడొ దండొ గుండా నరేంద్ర సరోవరం తీరానికి చేరుతాయి. దారి పొడవునా స్వామికి ధూపదీప నైవేద్యాదులు సమర్పిస్తారు. పలుచోట్ల పంక్తి భోగం నివేదించడం ఆచారంగా కొనసాగుతోంది.

చలువ పందిరి సిద్ధం

వేసవి తాపం నుంచి రథ తయారీ కార్మికులకు రక్షణ కల్పించేందుకు చలువ పందిరి ఏర్పాటు చేస్తున్నారు. దీని ఛాయలో రథాల తయారీ పనులు కొనసాగుతాయి. చందన యాత్ర కోసం స్వామి ఊరేగింపుగా తరలి వెళ్లే మార్గంలో అక్కడక్కడ చలువ పందిళ్లు ఏర్పాటు చేస్తారు. ఈ ప్రాంగణాల్లో స్వామికి భక్తులు పంక్తి భోగం నివేదిస్తారు.

అంచెలంచెలుగా చేరుతున్న దుంగలు

యాత్ర కోసం రథాల తయారీకి అవసరమైన దుంగలు నిర్మాణ శాల ప్రాంగణానికి తరలి వస్తున్నాయి. ఇప్పటివరకు 4 విడతల్లో కలప దుంగలు చేరాయి. గతేడాది సేకరించిన దుంగల్లో 53 దుంగలు మిగిలి ఉన్నాయి. ఈ ఏడాది రథాల తయారీకి సమగ్రంగా 812 దుంగలు అవసరం ఉంటుంది. విడతలవారీగా 152 దుంగలు రథ నిర్మాణ శాల ప్రాంగణానికి చేరుకోగా 33 దుంగలు కలప మిల్లుకు చేరాయి.

అక్షయ తృతీయ కార్యక్రమాలు ఖరారు

అక్షయ తృతీయ సందర్భంగా శ్రీమందిరంలో నిర్వహించే ప్రత్యేక కార్యక్రమాల వేళలను ఖరారు చేశారు. శుక్రవారం వేకువజామున 3 గంటలకు దేవస్థానం తలుపులు తెరుస్తారు. చందన యాత్ర కోసం మధ్యాహ్నం 3.30 గంటలకు ఉత్సవమూర్తులకు పల్లకిలో ఊరేగింపునకు సన్నాహాలు చేస్తారు. సాయంత్రం 4 గంటలకు చందన యాత్ర కోసం స్వామి ఆజ్ఞామాల చేరడంతో శ్రీమందిరం నుంచి నరేంద్ర సరోవరంకి పల్లకిలో ఉత్సవమూర్తుల ఊరేగింపు ప్రారంభిస్తారు. సేవా సబ్ కమిటీ ప్రతిపాదన మేరకు 36 నియోగుల సంఘం ఈ కార్యక్రమాల ఆచరణకు అంగీకారం తెలిపింది. శ్రీమందిరం ప్రధాన పాలన అధికారి సీఏవో వీర విక్రమ యాదవ్ అధ్యక్షతన స్థానిక నీలాద్రి భక్త నివాస్‌లో జరిగిన సమావేశంలో ఉత్సవాల కార్యక్రమాలు ఖరారు చేశారు. సాయంత్రం 6 గంటలకు సంధ్యా హారతి, రాత్రి 10 గంటలకు మైలమ్, 10.30 గంటలకు చందన సేవ, రాత్రి 11.30 గంటలకు బొడొ సింగారొ అలంకరణ, భోగ నివేదన చేస్తారు. అర్ధరాత్రి 12.30 గంటలకు ఏకాంత సేవ జరుగుతుందని తెలిపారు. అలాగే ఈనెల 15న నీలాద్రి మహోదయ అష్టమి, 22న నృసింహ జయంతి, 29న శ్రవణ మకర నక్షత్ర భంవురి యాత్ర ప్రత్యేక ఉత్సవాలు జరగనున్నాయి.

రథాల తయారీకి అంకురార్పణ

అక్షయ తృతీయ పురస్కరించుకుని శుక్రవారం నుంచి శ్రీజగన్నాథుని వార్షిక యాత్ర కోసం రథాల తయారీకి అంకురార్పణ చేస్తారు. దీనికోసం సిద్ధం చేసిన రథ తయారీ శాల ప్రాంగణంలో ప్రత్యేక పూజాదులు నిర్వహించి రథాల తయారీ పనులకు శ్రీకారం చుడతారు. శ్రీ మందిరం రత్నవేదిక నుంచి మూల విరాటుల ఆజ్ఞామాలలు చేరిన తర్వాత నిర్మాణ శాలలో ప్రత్యేక పూజాదులు నిర్వహిస్తారు. అనంతరం మహరణ వర్గం సేవకులు రథాల తయారీ పనులను లాంఛనంగా ప్రారంభిస్తారు. 3 రథాల కోసం ముందస్తుగా ఎంపిక చేసిన ప్రత్యేక దుంగలను పూజ కోసం సిద్ధం చేస్తారు. శ్రీమందిరం నుంచి ఒక్కో రథం కోసం వేర్వేరుగా ఆజ్ఞామాలల్ని తీసుకొచ్చి బంగారు గొడ్డలితో లాంచనగా చీల్చడంతో రథాల తయారీ పనులు ప్రారంభమైనట్లు పరిగణిస్తారు. ఒక్కో రథానికి ఒక్కో ప్రధాన వడ్రంగి (మహరణ సేవాయత్) ఈ పూజలో ప్రత్యేకంగా పాల్గొంటారు. రథాల తయారీ ఆద్యంతాలు ఈ ముగ్గురు ప్రత్యక్షంగా పర్యవేక్షిస్తారు.



రథ వడ్రంగులకు చలువ పందిరి



రథశాలకు చేరుతున్న దుంగలు



రంగుల కళతో తుది మెరుగులు దిద్దుకుంటున్న నావలు



నరేంద్ర సరోవరం హంస తోరణం

బీజేడీ తరపున ఓలివుడ్ సినీతారల ప్రచారం

పర్లాకిమిడి: పర్లాకిమిడి బీజేడీ అభ్యర్థి రూపేష్ పాణిగ్రాహికి మద్దతుగా ఓలివుడ్ సినీ హీరో బాబు శేన్, అభినేత్రి ఎలినా సామంత్రాయ్ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఒడియా సినీతారలు బాబుసేన్, ఎలినా సామంత్రాయ్‌లు రాంనగర్ హైటెక్ ప్లాజా నుంచి సుభాష్ నగర్, కుంభారీ వీధి, రైల్వే స్టేషన్ రోడ్డు, రాజగురు వీధి, కటిక వీధి, రాజవీధి మీదుగా అనేక వార్డుల్లో రోడ్ షో చేపట్టారు. సంతపేట వద్ద మహిళలు పెద్ద ఎత్తున తమ అభిమాన నటీనటులను చూడటానికి ఉత్సాహం చూపించారు. బీజేడీ యువజన నాయకులు బ్రజేష్ త్రిపాఠి ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ జరిపారు. ఈ ర్యాలీలో బీజేడీ సీనియర్ నాయకులు బసంత్ దాస్, కౌన్సిలరు జ్యోతిర్మయి దాస్ తదితరులు పాల్గొన్నారు.



ప్రచారంలో పాల్గొన్న సినీ హీరో బాబు సేన్, అభినేత్రి ఎలినా సామంత్రాయ్

యువతిపై అత్యాచారం

- ఆరుగురు నిందితులు అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ సర్థక్ సడంగి

బరంపురం: ఒక యువతిపై అత్యాచారం కేసులో ఆరుగురు నిందితులను అరెస్టు చేసినట్లు బరంపురం ఎస్పీ డా.సర్థక్ సడంగి తెలియజేశారు. ఈ మేరకు బుధవారం సాయంత్రం ఎస్పీ కార్యాలయ సమావేశ మందిరంలో వివరాలు వెల్లడించారు. ఈనెల 5వ తేదీ రాత్రి బీఎన్‌పూర్ పోలీసుస్టేషన్ పరిధి కొత్త బస్టాండ్‌లో రాత్రి 9 గంటల సమయంలో ఉన్నటువంటి యువతిని, రితున్ దాస్ అనే యువకుడు హిల్‌పట్నాలో ఉన్న తన రూమ్‌కి తీసుకెళ్లి మత్తుమందు ఇచ్చి అత్యాచారం చేశాడు. అనంతరం ఫోన్ ద్వారా తన ఫ్రెండ్స్‌ను పిలిచి మరలా యువతిపై వారితో కలిసి అత్యాచారానికి పాల్పడ్డారు. దీంతో జరిగిన అఘాయిత్యంపై బాధిత యువతి బీఎన్‌పూర్ పోలీసుస్టేషన్‌లో లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసిన పోలీసులు దారుణానికి పాల్పడిన ఆరుగురు నిందితులను అరెస్టు చేసి బరంపురం సర్కిల్ జైలుకి తరలించారు. అరెస్టైనవారిలో రితున్ దాస్, రుద్రాజెన్నా, అభినాష్ పొలై, అకాష్ నాయక్, సమీత్ పాణిగ్రాహి, గోకుల్ బిహారిల ఉన్నట్లు నిర్ధారించారు.



అరెస్టైన నిందితులు



ఆందోళన చేస్తున్న మహిళా మోర్చా సభ్యులు

నిందితులను కఠినంగా శిక్షించాలి

యువతిపై అత్యాచారం చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని బీజేపీ నేతలు డిమాండ్ చేశారు. ఈ మేరకు బరంపురం ఎస్పీ కార్యాలయం ఎదురుగా బీజేపీ మహిళా మోర్చా సభ్యులు గురువారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా అధ్యక్షురాలు మీనతి సాహు మాట్లాడుతూ అత్యాచారానికి సంబంధించిన నిందితులను ఎట్టిపరిస్థితుల్లోనూ విడిచిపెట్టకూడదన్నారు. అనంతరం ఎస్పీ డా.సర్థక్ సడంగికి వినతిపత్రం అందజేశారు. ఆందోళనలో జిల్లాకు చెందిన బీజేపీ మహిళా మోర్చ నాయకులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయం

- సక్రమంగా సంక్షేమ పథకాలు అమలు
- ఎన్నికల ప్రచారంలో ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్



వేదికపై సీఎం నవీన్ పట్నాయక్, మంత్రి ఉషాదేవి, విక్రమ్ పండా, భుగుభక్తి పాత్రో, బీజేడీ అభ్యర్థులు

బరంపురం: ''ప్రజల సంక్షేమమే నా ధ్యేయం.. వారంతా సంతోషంగా ఉంటేనే నేను సంతోషంగా ఉంటాను'' అని ఒడిశా రాష్ట్ర ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా నవీన్ పట్నాయక్ ప్రాతినిధ్యం వహిస్తున్న గంజాం జిల్లా బరంపురం నగరం సమీపంలోని గోపాల్‌పూర్ నియోజకవర్గం పరిధి కొనిసి గ్రామంలో బిజూ జనతాదళ్ (బీజేడీ) పార్టీ భారీ బహిరంగ సభను గురువారం నిర్వహించింది. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. ఒడిశా రాష్ట్రంలో మహిళలు అన్ని రంగాల్లో చరిత్ర సృష్టిస్తూ రాష్ట్ర గౌరవ ప్రతిష్ఠలు పెంచుతున్నారని చెప్పారు. ఒడిశా అసెంబ్లీలో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ అమలు చేసి వారికి రాజకీయ రంగంలో పెద్దపీట వేశామని చెప్పారు. రాష్ట్రంలో తమ ప్రభుత్వం గడిచిన 21 ఏళ్ల పాలనలో విద్య, వైద్యం, తాగు, సాగునీరు, రహదారుల నిర్మాణాలకు అధిక ప్రాధాన్యం ఇచ్చినట్టు పేర్కొన్నారు. దేశంలోనే తొలిసారిగా గంజాం జిల్లాలోని ఎన్ఏసీ, మున్సిపాలిటీ, కార్పొరేషన్ పరిధిలోని బస్తీవాసులకు 'భూమి అధికారి' పట్టాల పంపిణీ పథకం ప్రారంభించి భూములు లేని నిరుపేదలకు పట్టాలు అందజేసినట్లు వివరించారు. ఇదో చారిత్రాత్మక ఘట్టమన్నారు. 21 ఏళ్ల బీజేడీ ప్రభుత్వ పాలనలో వందకుపైగా ప్రజాసంక్షేమ పథకాలు అమలు చేసి ప్రజలను సంతోషంగా ఉంచామని సీఎం నవీన్ చెప్పారు. బస్తీ వాసులు పొందిన భూమి హక్కు పట్టాల ద్వారా బ్యాంకు రుణాలు ఇచ్చామన్నారు. పిల్లల చదువులకు రుణాలతో ఉన్నత విద్య అభ్యసించేందుకు సహకరించినట్టు పేర్కొన్నారు. సభలో పాల్గొన్న రాష్ట్ర మహిళా సంక్షేమ శాఖ మంత్రి ఉషాదేవి మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ క్రీడాస్ఫూర్తితో వ్యవహరించి ప్రపంచ హాకీ కప్పు చాంపియన్ ట్రోఫీని ఇక్కడ ప్రారంభించి ప్రపంచ దేశాల్లో ఒడిశా రాష్ట్ర గౌరవ ప్రతిష్ఠలు పెంచారని చెప్పారు. గోపాల్‌పూర్ బీజేడీ ఎమ్మెల్యే అభ్యర్థి విక్రమ్ పండా మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ ప్రజల సంక్షేమం కోసం అనేక సంక్షేమ పథకాలు అమలు చేసి అందరి మన్ననలు పొందారన్నారు. త్వరలో జరగనున్న ఎన్నికల్లో బీజేడీ పార్టీ తరపున పోటీ చేస్తున్న అభ్యర్థులను శంఖం గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని నాయకులందరూ పిలుపునిచ్చారు. ఐటీ మంత్రి ఉషాదేవి, గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి విక్రమ్ కేశరి ఆరక్‌తో పాటు గంజాం గంజాం జిల్లాలోని 12 మంది బీజేడీ ఎమ్మెల్యే అభ్యర్థులు, పార్టీ నాయకులు, భారీగా ప్రజలు పాల్గొన్నారు.



ప్రజలనుద్దేశించి మాట్లాడుతున్న ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్



సభకు హాజరైన ప్రజలు



సభలో పాల్గొన్న గంజాం జిల్లాకు చెందిన బీజేడీ మహిళా నాయకులు



బీజేడీ పార్టీ గుర్తు శంఖంతో కార్యకర్తల సందడి

క్లుప్తంగా

ఆదిత్యుని సన్నిధిలో హైకోర్టు జడ్జి జస్టిస్ రవీంద్రబాబు



న్యాయమూర్తికి జ్ఞాపిక అందజేస్తున్న దృశ్యం

అరసవల్లి: ప్రసిద్ధ సూర్యక్షేత్రం అరసవల్లి సూర్యనారాయణ స్వామిని ఏపీ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎ.వి.రవీంద్రబాబు కుటుంబసమేతంగా గురువారం దర్శించుకున్నారు. ఆలయ సూపరింటెండెంట్ కృష్ణమాచార్యులు, ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మలు గౌరవ స్వాగతం పలికి అంతరాలయ దర్శనం చేయించారు. ఆలయ విశిష్టత వివరించి తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా ప్రోటోకాల్ సిబ్బంది, వన్‌టౌన్ ఎస్సై బలివాడ గణేష్ పాల్గొన్నారు.

జూలై 10 నుంచి అరసవల్లిలో ద్విశతావధానం



మాట్లాడుతున్న ఇప్పిలి శంకరశర్మ

అరసవల్లి: ప్రత్యక్ష దైవం అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయం, శ్రీసుమిత్ర కళా సమితి సంయుక్త ఆధ్వర్యంలో ఈ ఏడాది జూలై 10 నుంచి 14 వరకు అరసవల్లిలో తొలిసారిగా ద్విశతావధానం నిర్వహిస్తున్నామని ప్రధానార్చకులు, శ్రీసుమిత్ర కళాసమితి అధ్యక్షులు ఇప్పిలి శంకరశర్మ తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ శ్రీసుమిత్ర కళాసమితి ద్వారా ఇప్పటివరకు 9 శతావధానాలను నిర్వహించామని చెప్పారు. జూలైలో వరుసగా ఐదు రోజుల పాటు ప్రముఖ మహిళా శతావధాని డాక్టర్ బులుసు అపర్ణచే శతావధానం పేర్కొన్నారు. పృచ్ఛకులుగా పాల్గొనేందుకు ఆసక్తి గల పండితులు, సాహితీవేత్తలు తమ పేర్లను పులఖండం శ్రీనివాసరావు (9949688625), బంకుపల్లె రమేష్ శర్మ (9441072502, 9963636785) నంబర్లకు ఫోన్ ద్వారా ముందుగా నమోదు చేయించుకోవాలని సూచించారు.

సత్యసాయి సేవా సమితి జిల్లా అధ్యక్షుడిగా రామచంద్రరావు



నియమాక పత్రం అందుకుంటున్న రామచంద్రరావు

శ్రీకాకుళం కల్చరల్: సత్యసాయి సేవా సమితి జిల్లా అధ్యక్షుడిగా సూర రామచంద్రరావు గురువారం బాధ్యతలు చేపట్టారు. శ్రీకాకుళంలోని పెద్దమందిరంలో కన్వీనర్ మురళీకృష్ణ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పూర్వపు జిల్లా అధ్యక్షుడు గంగుల రమణబాబు కేంద్రం నుంచి వచ్చిన నియామక పత్రాన్ని రామచంద్రరావుకు అందజేశారు. ఈ సందర్భంగా పలు సమితుల సభ్యులు అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో హయాతినగరం మందిరం సభ్యులు కిల్లా ఫల్గుణరావు, అనాద గుప్త, పి.నాగేశ్వరరావు, బోయిన నరసింహమూర్తి, సోమశేఖర్, కృష్ణారావు, కె.భాస్కరరావు, లోకనాధం రామారావు పాల్గొన్నారు.


పార్సిల్ కౌంటర్లలో సెబ్ జేడీ తనిఖీలు



తనిఖీలు చేస్తున్న సెబ్ జేడీ గంగాధరం

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లాకేంద్రంలోని పలు ట్రావెల్స్, పార్సిల్ సెంటర్లను శ్రీకాకుళం స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అదనపు ఎస్పీ, జాయింట్ డైరెక్టర్ డి.గంగాధరం గురువారం ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఎన్నికల నేపథ్యంలో ఓటర్లను ప్రలోభపర్చేందుకు రాజకీయ పార్టీలు అక్రమ దారుల్లో మద్యం, నగదు, సారాయి, గంజాయి వంటివి పంపిణీ చేయకుండా సోదాలు చేశారు. శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్సులోని పార్సిల్ సెంటర్‌తో పాటు ట్రావెల్స్ కార్యాలయాల్లో రికార్డులు పరిశీలించారు.

పారా ఒలింపిక్ బీచ్ వాలీబాల్ జట్టుకు రమణ ఎంపిక



ఎం.వెంకటరమణ

శ్రీకాకుళం న్యూకాలనీ: చైనా వేదికగా ఈనెల 28 నుంచి జూన్ 5 వరకు జరిగే పారాబీచ్ వాలీబాల్ ప్రపంచ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొనే భారత జట్టుకు జిల్లాకు చెందిన మైలపల్లి వెంకటరమణ ఎంపికయ్యాడు. ఈ మేరకు పారా ఒలింపిక్ వాలీబాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా తుది జట్టును ప్రకటించింది. వెంకరటమణ స్వస్థలం రణస్థలం మండలం కొవ్వాడ. తల్లిదండ్రులు మైలపల్లి కృష్ణ, లక్ష్మి మత్స్యకారులు. వెంకటరమణ డిగ్రీ చదువుతున్నాడు. పోలియో బారిన పడినప్పటికీ తనకు ఇష్టమైన క్రీడల్లో రాణిస్తూ స్ఫూర్తిగా నిలుస్తున్నాడు.

విభిన్న సంస్కృతుల సంగమం..

ఉమ్మరకోట్ సొంతం!

- ఎక్కువసార్లు గెలుపొందిన కాంగ్రెస్ అభ్యర్థులు
- ఆ స్థానంలో పాగా వేసిన బీజేడీ పార్టీ
- ఈసారి పట్టం కట్టేది ఎవరికో?
- ఉమ్మరకోట్ (ఎస్టీ) నియోజకవర్గం ముఖచిత్రం



మావోయిస్టుల గుళ్లకు బలైన జగబందు మఝి(ఫైల్)



జిల్లాలో తొలిసారి మంత్రి అయిన పరమ పూజారి



నాలుగుసార్లు విజయం సాధించిన స్వాతంత్య్ర సమర యోధుడు రబిసింగ్ మఝి



మొదటి బీజేపీ ఎమ్మెల్యే ధర్మ గోండ్



ఎఫ్.నవీన నాయిక్ (బీజేడీ)



సనరాజ్ గోండ్ (కాంగ్రెస్)



నిత్యానంద గోండ్ (బీజేపీ)

జయపురం: ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర సరిహద్దులో నక్సల్ ప్రభావిత నవరంగపూర్ జిల్లాలో ఉన్న ఉమ్మరకోట్ అసెంబ్లీ స్థానానిది ప్రత్యేక స్థానం. విభిన్న సంస్కృతుల సంగమం దీని సొంతం. గతంలో కాంగ్రెస్ పార్టీకి పెట్టని కోట. అయితే బెంగాలీ శరణార్థులకు ఈ ప్రాంతంలో పునరావాసం కల్పించిన తరువాత వెల్లువెత్తిన నిరసనలు, భూ వివాదాలు ఆదివాసీ, శరణార్థ బెంగాలీ సంప్రదాయ ప్రజల మధ్య విభేదాలకు దారితీశాయి. దీంతో కాంగ్రెస్ హవా తగ్గి బీజేడీ పగా వేసింది. ముఖ్యంగా ఆనాటి పాలకులు ఆదివాసీలు అనాధిగా సాగు చేసుకుంటున్న భూముల్లో శరణార్థులకు స్థానం కల్పించటంతో సమస్య తలెత్తింది. ఆ సమయంలో యువనేత జగబందు మఝి ఆదివాసీలకు, స్థానిక దళితులకు అండగా నిలచారు. దళిత సమాజ్ పేరుతో వారి హక్కుల కోసం ఉద్యమం చేపట్టారు. బెంగాలీ శరణార్థులు, ఆదివాసీల మధ్య భూ తగాదాలు, హత్యలు, గృహ దహన సంఘటనలు కొంతకాలం ఆ ప్రాంతాన్ని భయం గుప్పిట్లో ఉంచాయి. జగబందు మఝిపై ప్రభుత్వం పలు కేసులు పెట్టింది. అయితే అదే సమయంలో ఉమ్మరకోట్‌లో పట్టు సాధించేందుకు బీజేపీ పార్టీ అధిష్టానం జగబందు మఝిని తమ వైపు తిప్పుకుంది. ఆయనపై ఉన్నకేసులు రద్దు చేస్తామన్న హామీ సైతం ఇచ్చింది. దీంతో అతను ఆ పార్టీలో చేరారన్న ప్రచారం అప్పట్లో జరిగింది. అయితే అప్పటికే మల్కన్‌గిరి జిల్లాలో పునరావాసం కల్పించబడిన బెంగాలీ శరణార్థులు తమ కష్టాలను రాష్ట్ర విధానసభలో ప్రస్తావించేందుకు తమ వ్యక్తిని పంపాలన్న లక్ష్యంతో ఎన్నికల బరిలో దిగారు. 1995, 2000 ఎన్నికలలో మల్కన్‌గిరి నుంచి విధానసభకు బీజేపీ అభ్యర్థిగా ఎన్నికైన బెంగాలీ శరణార్థ నేత అరవింద డాళీ 2000లో ఆనాటి బీజేడీ–బీజేపీ మిశ్రమ ప్రభుత్వంలో మంత్రి అయ్యారు. అతడి ప్రభావం ఉమ్మరకోట్ బెంగాలీ శరణార్థులపై పడింది. అప్పటికే సమస్యలతో అట్టుడుకుతున్న ఉమ్మరకోట్‌లో బీజేపీ శరణార్థుల్లో పట్టు సాధించింది. 2004లో బీజేపీ తన అభ్యర్థి ధర్మ గోండ్‌ను బరిలో దింపింది. బెంగాలీ నేత అరవింద డాళీ ప్రభావంతో ఉమ్మరకోట్ బెంగాలీలు బీజేపీకి మూకుమ్మడిగా ఓటు వేసి అతడిని గెలిపించారు. ఈ పరిణామం చూసిన రాష్ట్రంలో అధికారంలో ఉన్న బీజేడీ 2009 ఎన్నికల్లో దళిత నేత జగబందు మఝిని పోటీబరిలో దింపింది. మఝి 14,171 ఓట్ల ఆధిక్యతతో బీజేపీ అభ్యర్థి ధర్మ గోండ్‌ను ఓడించి బీజేడీకి స్థానం కల్పించారు. అయితే 2011 సెప్టెంబర్ 24వ తేదీన రాయఘర్ సమితి గోన గ్రామ సంతలో ప్రజలకు భూమి పట్టాలు పంచుతున్న సమయంలో మావోయిస్టులుగా భావించబడిన కొందరు జగబందు మఝిపై తుపాకీలతో కాల్పులు జరిపారు. ఆ ఘటనలో జగబందు మఝితో పాటు అతడి అంగరక్షకుడు ప్రాణాలు కోల్పోయారు. ఉమ్మరకోట్ నియోజకవర్గానికి చెప్పుకోదగ్గ చరిత్ర ఉంది. ఈ స్థానం నుంచిఅవిభక్త కొరాపుట్ జిల్లాలో ప్రముఖ స్వాతంత్య్ర సమర యోధులు రాధాకృష్ణ బిశ్వాసరాయ్, సదాశివ త్రిపాఠీ, రబిసింగ్ మఝిలు గెలుపొందారు. అంతే కాకుండా ఈ నియోజకవర్గం నుంచి నాలుగుసార్లు విజయం సాధించిన పరమ పూజారి కాంగ్రెస్ ప్రభుత్వ మంత్రివర్గంలో స్థానం పొంది జిల్లాలో మొదటి మహిళా మంత్రిగా గుర్తింపు తెచ్చుకున్నారు. ఈ నియోజకవర్గంలో 2019 వరకు జరిగిన ఎన్నికల్లో ఏడుసార్లు కాంగ్రెస్ పార్టీ విజయం సాధించగా, ఉత్కళ కాంగ్రెస్ రెండుసార్లు, జనతా పార్టీ, జనతాదళ్ ఒక్కోసారి, బీజేపీ రెండు సార్లు గెలుపొందాయి. 1957లో ఏర్పాటైన ఉమ్మరకోట్ నియోజకవర్గంలో ఉమ్మరకోట్, ఝోరిగాం పోలీసు స్టేషన్ ప్రాంతాలు ఉండేవి. అప్పుడు జనరల్ స్థానంగా ఉండే ఉమ్మర్‌కోట్ 1967 నాటికి ఎస్టీలకు రిజర్వ్ చేశారు. 1957లో ఈ స్థానం నుంచి అవిభక్త కొరాపుట్ జిల్లాలో కొరాపుట్ గాంధీగా పిలిచే స్వాతంత్య్ర సమర యోధుడు రాధాకృష్ణ బిశ్వాసరాయ్ గెలుపొందగా 1961 మరో స్వాతంత్ర యోధుడు సదాశివ త్రిపాఠీ విజయం సాధించారు. వీరిరువురి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులుగా గెలుపొందారు. 1967 ఎన్నికల్లో మరో స్వాతంత్య్ర యోధుడు రబిసింగ్ మఝి కాంగ్రెస్ నుంచే విజయం సాధించారు. తరువాత ఆయన ఉత్కళ కాంగ్రెస్‌లో చేరి 1971, 1974 ఆ పార్టీ అభ్యర్థిగా విజయం సాధించారు. అనంతరం రబిసింగ్ మఝి 1977లో జనతా పార్టీ అభ్యర్థిగా పోటీ చేసి విధానసభలో నాలుగోసారి కాలు పెట్టారు. తరువాత జరిగిన నియోజకవర్గాల విభజనలో ఉమ్మరకోట్ నియోజకవర్గంలో ఉమ్మరకోట్ ఎన్ఏసీ, రాయిఘర్ సమితి, ఉమ్మరకోట సమితిలో కురుసి, బెహడ, కోపేన, బకోడ, ముర్తమ, బెజ, సునాబెడ, సెమల గ్రామ పంచాయతీలతో ఏర్పాటు చేశారు. 1980 ఎన్నికల్లో కాంగ్రెస్ మహిళా నాయకురాలు పరమ పూజారి విజయం పొందారు. 1985 ఎన్నికల్లో కూడా విజయం సాధించిన ఆమె 1990 ఎన్నిల్లో ఓటమి చెందారు. ఆ ఎన్నికలో గురువార మఝి జనతాదళ్ అభ్యర్థిగా గెలుపొందారు. అయితే 1995, 2000లలో జరిగిన ఎన్నికల్లో మరోసారి పరమ పూజారి విజయాలు సాధించారు. 2004 ఎన్నికల్లో ఈ స్థానాన్ని కాంగ్రెస్ నుంచి బీజేపీ కైవసం చేసుకుంది. ఆ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి ధర్మ గోండ్ విజయం పొందారు. అయితే 2009లో జరిగిన ఎన్నికలో దళిత నేత జగబందు మఝి బీజేపీ అభ్యర్థిగా గెలుపొంది బీజేపీ, కాంగ్రెస్‌లకు చెక్ పెట్టారు. అతడి హత్య అనంతరం 2014లో జగబందు మఝి అనుచరుడు సుభాష్ గోండ్ బీజేడీ అభ్యర్థిగా బరిలో దిగి తన సమీప కాంగ్రెస్ అభ్యర్థి జితేంద్ర గోండ్‌పై 10,522 ఓట్ల ఆధిక్యతతో విజయం సాధించారు. ఆ ఎన్నికలో బీజేపీ అభ్యర్థి మూడో స్థానంలో నిలిచారు. బీజేడీ అభ్యర్థి సుభాష్ గోండ్‌కు 50,500 ఓట్లు రాగా కాంగ్రెస్ అభ్యర్థి జితేంద్రకు 39,978 ఓట్లు వచ్చాయి. 2009లో విజయం సాధించిన బీజేపీకి కేవలం 21,351 ఓట్లు వచ్చాయి. ఆ ఎన్నికలో బీజేపీ అభ్యర్థిగా నిత్యానంద గోండ్ పోటీ చేశారు. అయితే 2019 ఎన్నికలో అనూహ్యంగా బీజేపీ అభ్యర్థి ఘన విజయం సాధించారు. ఆ పార్టీ అభ్యర్థి నిత్యానంద గోండ్ 59,895 ఓట్లు పొంది తన సమీప బీజేడీ అభ్యర్థి సుభాష్ గోండ్‌పై 9,922 ఓట్ల ఆధిక్యతతో విజయం సాధించారు. సుభాష్ గోండ్‌కు 49,973 ఓట్లు రాగా కాంగ్రెస్ అభ్యర్థి జసోద గోండ్‌కు 32,343 ఓట్లు వచ్చాయి. ఈ నెల 13వ తేదీన జరగనున్న ఎన్నికలో ఉమ్మర్‌కోట్ నియోజకవర్గంలో ప్రధాన పోటీ కాంగ్రెస్, బీజేపీ, బీజేడీ అభ్యర్థుల మధ్యే ఉంటుందని రాజకీయ విశ్లేషకుల అంచనా. కాంగ్రెస్ తరఫున సనరాజ్ గోండ్, బీజేడీ అభ్యర్థిగా నవీన నాయక్, బీజేపీ అభ్యర్థిగా నిత్యానంద గోండ్ తలపడుతున్నారు. ఓటర్లు ఎవరికి పట్టం కడతారో వేచిచూడాలి.

ఓటింగ్ శాతం పెంచాలి



బెలూన్లు ఎగర వేస్తున్న అధికారులు



ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు



నగర వీధుల్లో సైక్లోథాన్

భువనేశ్వర్: సార్వత్రిక ఎన్నికల్లో ఓటింగ్ శాతం పెంచేందుకు అనుబంధ యంత్రాంగం చురుగ్గా పనిచేస్తోంది. ఈ నేపథ్యంలో పలు చైతన్య కార్యక్రమాలు చేపడుతోంది. దీనిలో భాగంగా గురువారం ఉదయం సైక్లోథాన్ నిర్వహించారు. ఖుర్దా జిల్లా అధికార యంత్రాంగం, భువనేశ్వర్ మున్సిపల్ కార్పొరేషన్ బీఎంసీ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టారు. స్థానిక సీఆర్‌పీఎఫ్ వెండింగ్ జోన్ నుండి మహాత్మా గాంధీ పార్క్ వరకు ఏకామ్ర కానన్, జయదేవ్ విహార్ కూడలి, కళింగ హాస్పిటల్ ఛక్ వీధుల గుండా నిర్వహించిన సైక్లోథాన్ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో ఔత్సాహిక యువతీ, యువకులు పాల్గొన్నారు. బీఎంసీ కమిషనర్, పోలీస్ కమీషనర్, ఖుర్దా కలెక్టర్ ప్రత్యక్ష పాల్గొని వారిని ప్రోత్సహించారు.

బీజేపీ అభ్యర్థులను గెలిపిస్తే పింఛన్ల పెంపు



సభలో మాట్లాడుతున్న అసోం ముఖ్యమంత్రి హేమంత్ విశ్వశర్మ



వేదికపై అతిథులు

- ఎన్నికల ప్రచారంలో అసోం ముఖ్యమంత్రి హేమాంత్ విశ్వశర్మ

మల్కన్‌గిరి: సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులను గెలిపిస్తే వివిధ వర్గాల పింఛన్లను పెంచుతామని అసోం రాష్ట్ర ముఖ్యమంత్రి హేమాంత్ విశ్వశర్మ ప్రకటించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మల్కన్‌గిరి జిల్లా కలిమెల సమితి ఎంపీవీ–82 గ్రామంలో బీజేపీ అభ్యర్థుల తరఫున నిర్వహించిన ఎన్నికల బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులను మల్కన్‌గిరిలో గెలిపించడతోపాటు ఒడిశాలో పార్టీ అధికారంలోకి వస్తే ప్రతి పాఠశాలలో బెంగాలీ ఉపాధ్యాయులను నియమిస్తామని చెప్పారు. అలాగే దివ్యాంగుల పింఛన్‌ను 2,100 రూపాయలను 3,100 రూపాయలకు, వృద్ధుల పింఛన్‌ను రూ. 3,000 చేస్తామన్నారు. సుభద్ర యోజన పథకంలో ప్రతి మహిళకు రూ. 50 వేలు చొప్పున ఇస్తామని హామీ ఇచ్చారు. కమలం గుర్తుపై ఓటువేసి బీజేపీ అభ్యర్థులను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. సభలో మల్కన్‌గిరి జిల్లా బీజేపీ అధ్యక్షుడు నిమయి చంద్ర పాల్, నవరంగ్‌పూర్ ఎంపీ అభ్యర్థి బోలభద్ర మాఝి, మల్కన్‌గిరి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి నర్సింగ్ మడ్కమి, చిత్రకొండ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి డొంబురు సీసా పాల్గొన్నారు.



సభకు హాజరైన ప్రజలు

రుబెల్లాపై గర్భిణులు అప్రమత్తంగా ఉండాలి

- రాష్ట్ర ఆరోగ్య సేవల డైరెక్టర్ బిజయ్ మహాపాత్రో

భువనేశ్వర్: రాష్ట్రంలో ఇటీవల తలెత్తిన రుబెల్లా సంక్రమణ కలకలం రేపుతోంది. ఈ నేపథ్యంలో దీని బారిన పడకుండా గర్భిణులు జాగ్రత్త వహించాలని రాష్ట్ర ఆరోగ్య సేవల డైరెక్టర్ బిజయ్ మహాపాత్రో హెచ్చరించారు. నవరంగపూర్ జిల్లాలో ఇటీవల ఇద్దరు బాలురు రుబెల్లా బారిన పడినట్లు అధికారికంగా ధ్రువీకరించిన విషయం తెలిసిందే. గర్భిణులకు దద్దుర్లు లేదా జ్వరం వచ్చినా తక్షణమే రుబెల్లా వైరస్ నిర్ధారణ వైద్య పరీక్షలను తప్పనిసరిగా చేయించుకునేందుకు వైద్య వర్గాలను సంప్రదించాలని డాక్టర్ బిజయ్ మహాపాత్రో సూచించారు. ముఖ్యంగా శిశువుకు వైరస్ సంక్రమించే అవకాశం ఉన్నందున గర్భిణులు జాగ్రత్తగా ఉండాలన్నారు. పిల్లలలో ఇది ప్రాణాంతకం కానప్పటికీ గర్భిణులకు ఈ వైరస్ సోకితే తమ పిల్లలలో పుట్టుకతో వచ్చే రుబెల్లా సిండ్రోమ్‌తో పాటు గుండె జబ్బులు, కంటిశుక్లం, కొన్ని ఇతర అనారోగ్య సమస్యలతో బాధపడే అవకాశం ఉందని పేర్కొన్నారు. అయితే పరిస్థితి అదుపులో ఉన్నందున భయాందోళన చెందాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు. ఈ పరిస్థితులపై నిఘా వేసేందుకు ఆరోగ్య శాఖ ర్యాపిడ్ రెస్పాన్స్ టీమ్ (ఆర్ఆర్‌టీ)ను రంగంలోకి దింపింది. మీజిల్స్ మరియు రుబెల్లా (ఎమ్ఆర్) ఇమ్యునైజేషన్ డ్రైవ్‌ను రాష్ట్రంలో మిషన్ మోడ్‌లో చేపట్టారు. చిన్నారుల్లోనే వైరస్ ఎక్కువగా ఉండడంతో ఆరోగ్య సేవా బృందాలు వారిపై దృష్టి సారించాయని తెలిపారు. నవరంగపూర్ జిల్లాలో నొందాహండి, తెంతులిఖుంటికి చెందిన ఇద్దరు పిల్లల్లో రుబెల్లా కనుగొనబడింది. ఏప్రిల్ 29న ఈ జిల్లా రెండు మండలాల్లో 5 మంది వ్యక్తుల నుంచి నమూనాలను సేకరించి పరీక్షల నిమిత్తం ప్రాంతీయ వైద్య పరిశోధనా కేంద్రానికి (ఆర్ఎంఆర్‌సీ) పంపించారు. ఈ పరీక్షల్లో ఏడాది బాలుడికి, ఎనిమిదేళ్ల బాలుడికి రుబెల్లా పాజిటివ్‌గా తేలింది.

స్పైస్‌జెట్‌కు రూ.60 వేల జరిమానా

భువనేశ్వర్: స్పైస్‌జెట్ విమానయాన సంస్థకు జిల్లా వినియోగదారుల ఫోరం భారీ జరిమానా విధించింది. ముందస్తు సమాచారం లేకుండా విమానం దారి మళ్లించి గమ్యం చేర్చడంలో చోటు చేసుకున్న జాప్యంతో తలెత్తిన పరిణామాల వివరణతో బాధిత వినియోగదారుడు న్యాయ సంస్థను ఆశ్రయించాడు. ఈ అసౌకర్యం పూర్వాపరాల్ని పరిశీలించిన మేరకు జిల్లా వినియోగదారుల ఫోరం.. స్పైస్‌జెట్ విమానయాన సంస్థకు రూ.60 వేల పరిహారం చెల్లించాలని ఆదేశించింది. ఝార్సుగుడ మాజీ సబ్ డివిజనల్ పోలీసు అధికారి (ఎస్‌డీపీఓ) నిర్మల్ మహాపాత్రో స్పైస్‌జెట్ విమానయాన సంస్థ సేవల్లో లోపాలున్నాయని ఆరోపిస్తూ జిల్లా వినియోగదారుల ఫిర్యాదుల పరిష్కార ఫోరంలో వ్యాజ్యం దాఖలు చేశారు. అసౌకర్యానికి అనుబంధంగా సమాచార హక్కు చట్టం కింద లభ్యమైన వివరాల్ని వినియోగదారుల ఫోరం దృష్టికి తీసుకువెళ్లారు. నిర్మల్ మహాపాత్రో 2021 సంవత్సరం నవంబర్ నెలలో స్పైస్‌జెట్‌లో టిక్కెట్లు బుక్ చేసుకుని కుటుంబంతో కలిసి అస్సాం పర్యటనకు వెళ్లారు. వారి తిరుగు ప్రయాణంలో విమానం సుమారు 3 గంటలు ఆలస్యంగా గమ్యం చేరింది. బాగ్డోగ్రా నుంచి బయల్దేరిన స్పైస్‌జెట్ విమానం కోల్‌కత్తాకు సాయంత్రం 6.30 గంటలకు చేరాల్సి ఉండగా రాత్రి 9.30 గంటలకు చేరింది. దీనిపై ఆరా తీయగా గౌహతికి దారి మళ్లించడంతో ఈ జాప్యం అనివార్యమైనట్లు గుర్తించారు. ఈ మేరకు ముందస్తు సమాచారం లేకుండా ప్రయాణంలో అసౌకర్యం కల్పించడంతో కోల్‌కత్తా నుంచి ఝార్సుగుడాకు వెళ్లాల్సిన రైలు తప్పిపోయినట్లు వివరించారు. దీంతో టాక్సీని అద్దెకు తీసుకుని సుదూర ఝార్సుగడకు రోడ్డు మార్గంలో ప్రయాణించడంతో తన కుటుంబీకులు అనారోగ్యానికి గురైనట్లు ఆరోపించారు. ఈ పరిస్థితి మరింత ఆవేదనకు గురి చేసిందని జిల్లా వినియోగదారుల ఫోరంకు అనుబంధ సాక్ష్యాధారాలతో రుజువు చేశారు. వీటిని పరిగణనలోకి తీసుకున్న న్యాయ సంస్థ సమన్వయ లోపం కారణంగా ప్రయాణీకులకు కలిగిన అసౌకర్యానికి రూ.50 వేలు, కేసు నమోదులో దరఖాస్తుదారుడు చేసిన ఖర్చుకు రూ.10 వేలు పరిహారం చెల్లించాలని ఆదేశించింది.

నేడు ప్రధానమంత్రి రోడ్ షో

- ఆంక్షలు విధించిన పోలీసులు

భువనేశ్వర్: ప్రధానమంత్రి నరేంద్రమోదీ రెండు రోజుల పర్యటన కోసం శుక్రవారం మరోసారి రాష్ట్రానికి రానున్నారు. స్థానిక రాజ్‌భవన్‌లో ఆయన రాత్రి బస చేస్తారు. ఈ సందర్భంగా నగరంలో జరగనున్న ప్రధాని నరేంద్రమోదీ రోడ్ షో దృష్ట్యా కమిషనరేట్ పోలీసులు వాహనాల రాకపోకలపై మార్గదర్శకాలు జారీ చేశారు. శుక్రవారం మాస్టర్ క్యాంటీన్ కూడలి నుంచి వాణీ విహార్ వరకు రెండు కిలో మీటర్ల మేర జనపథ్ రోడ్‌లో ప్రధాని మోదీ రోడ్‌షో నిర్వహించనున్నారు. ఐదేళ్లలో మోదీకి ఇది రెండో రోడ్ షో.

పటిష్టమైన భద్రత

దీని కోసం 55 ప్లాటూన్ల పోలీసు బలగాల్ని మోహరించనున్నారు. శాంతిభద్రతల పరిరక్షణ కోసం ప్రధాని రోడ్ షో కోసం ఐదుగురు డీసీపీ హోదా అధికారులు, పది మంది అదనపు డీసీపీలు, 27 మంది ఏసీపీలు, 41 మంది ఇన్‌స్పెక్టర్లు, 180 మంది సబ్‌ఇన్‌స్పెక్టర్లను మోహరిస్తారు. రహదారులకు ఇరువైపులా బారికేడ్లు ఏర్పాటు చేయనున్నారు. మూడు యూనిట్ల ప్రత్యేక వ్యూహాత్మక విభాగం (ఎస్టీయూ)తో పోలీసు సిబ్బంది సాధారణ దుస్తులలో పరిస్థితి పట్ల నిఘా వేస్తారు. వాహనాల రవాణా పురస్కరించుకుని శాంతిభద్రతల నిర్వహణకు అనుకూలంగా చోదకులకు ఇబ్బంది కలగకుండా జారీ చేసిన నియంత్రణ మార్గదర్శకాల్లో కమిషనరేట్ పోలీసులు ఈ మార్గంలో వాహనాల రాకపోకలపై కొన్ని ఆంక్షలు విధించారు. శుక్రవారం మధ్యాహ్నం రెండు గంటల నుంచి మాస్టర్ క్యాంటీన్ నుంచి వాణి విహార్ వైపు వాహనాల రాకపోకలను నివారించే దిశలో దారి మళ్లిస్తారు. సాధారణ ప్రజల సౌకర్యార్థం జనపథ్ రహదారిపై వాహనాల రాకపోకలు ఇతర కార్యకలాపాలు లేకుండా సీల్ చేస్తారు.

పోలీసులు జారీ చేసిన మార్గదర్శకాలు

శుక్రవారం మధ్యాహ్నం రెండు గంటల నుంచి రోడ్ షో ముగిసే వరకు జనపథ్ రహదారిపై..మాస్టర్ క్యాంటీన్ నుంచి వాణి విహార్ వరకు వాహనాలకు అనుమతి లేదు. వీధులు, సందులు గుండా వచ్చే వాహనాల రవాణాకు జనపథ్‌కు ఇరువైపుల మాస్టర్ క్యాంటీన్ నుంచి వాణి విహార్ వరకు జనపథ్ రహదారిని వినియోగించుకోవడానికి అనుమతించరు. తదనుగుణంగా వాహనదారులు తమ రూట్‌ను ప్లాన్ చేసుకోవాలని పోలీసులు సూచించారు.

స్ట్రాంగ్ రూమ్ ఏర్పాట్ల పరిశీలన

ఎచ్చెర్ల క్యాంపస్: చిలకపాలెంలోని శ్రీశివానీ ఇంజినీరింగ్ కాలేజీలో ఈవీఎంలు, ఇతర ఎన్నికల సామగ్రి డిపాజిట్ చేసే కేంద్రాలు, స్ట్రాంగ్ రూంలు, రిసెప్షన్ కేంద్రాలు, కౌంటింగ్ కేంద్రాలను ఎన్నికలు పరిశీలకులు శేఖర్ విద్యార్థి, దిగంబర్ ప్రధాన్‌లు గురువారం పరిశీలించారు. ఏర్పాట్లపై కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్, ఎస్పీ రాధిక, ఇతర అధికారులతో చర్చించారు. సజావుగా ఎన్నికల ప్రక్రియ జరగాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ తమీమ్ అన్సారియా, జేసీ ఎం.నవీన్, అసిస్టెంట్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా, అదనపు ఎస్పీ ప్రేమ్ కాజల్ పాల్గొన్నారు.

దువ్వాడకు శిష్టకరణాల మద్దతు

టెక్కలి: వైఎస్సార్‌సీపీ టెక్కలి ఎమ్మెల్యే అభ్యర్థి దువ్వాడ శ్రీనివాస్ ఎన్నికల ప్రచారానికి శిష్టకరణం సామాజికవర్గ ప్రతినిధులు మద్దతు పలికారు. శిష్టకరణం కార్పొరేషన్ డైరెక్టర్ సదాశివుని కృష్ణ, ప్రతినిధులు పోలిమహంతి ఉమామహేశ్వరరావు, అంపలాం వసంత్‌కుమార్, జి.ఆర్.జి.నాయుడు తదితరులు గురువారం దువ్వాడ శ్రీనివాస్‌ను మర్యాద పూర్వకంగా కలిసి ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కృష్ణ మాట్లాడుతూ దివంగత సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో శిష్టకరణాలకు ప్రత్యేక గుర్తింపునిచ్చారని, ఆ తరువాత ఆయన తనయుడు, ప్రస్తుత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలోనే ప్రత్యేక కార్పొరేషన్ల ఏర్పాటుతో పాటు సంక్షేమానికి పెద్దపీట వేశారని గుర్తు చేశారు. ఈ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి పూర్తి స్థాయిలో మద్దతు ఇస్తున్నట్లు వెల్లడించారు.

క్లుప్తంగా

దరఖాస్తుల ఆహ్వానం

- ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్, జిల్లా కన్వీనర్ టీవీ గిరి



టీవీ గిరి, ప్రిన్సిపాల్, జిల్లా కన్వీనర్

విజయనగరం రూరల్: జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ పారిశ్రామిక శిక్షణా సంస్థల్లో (ఐటీఐ) 2024 సంవత్సరానికి సంబంధించి ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని, ఆసక్తిగల విద్యార్థులు జూన్ 10 వరకు దరఖాస్తు చేసుకోవాలని విజయనగరం ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్, జిల్లా కన్వీనర్ టీవీ గిరి తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ, విద్యార్థులు ఐటీఐ.ఏపీ.జీఓవీ.ఐఎన్ వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, అనంతరం వచ్చిన యునిక్ నంబర్‌తో ఈ నెల 10వ తేదీ నుంచి వారికి దగ్గరలో ఉన్న ప్రభుత్వ ఐటీఐకి వెళ్లి ఒరిజినల్ ధ్రువపత్రాలు చూపించాలన్నారు. అభ్యర్థులు ఏ జిల్లాలోనైనా దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం ఉందని తెలిపారు. ప్రభుత్వ ఐటీఐలో యూనిక్ సంఖ్యతో ధ్రువపత్రాలు పరిశీలన చేయించుకున్న అభ్యర్థులే కౌన్సిలింగ్‌కు అర్హత సాధిస్తారన్నారు. వెల్డర్, ప్లంబర్ ట్రేడ్‌లలో ప్రవేశాలకు 8వ తరగతి ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులు.. మిగతా ట్రేడ్‌లకు పదో తరగతి ఉత్తీర్ణత సాధించిన వారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. రిజిస్ట్రేషన్ సమయంలో అభ్యర్థులు ఆధార్ అనుసంధానమైన మొబైల్ నంబర్‌తో ఐటీఐ వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. అభ్యర్థి పేరు, తండ్రి పేరు, పుట్టిన తేదీ, జెండర్ ఈ నాలుగు అంశాలు పదో తరగతి మార్కుల జాబితాలోనూ, ఆధార్ కార్డులోనూ ఒకే విధంగా ఉండాలన్నారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

బొండపల్లి: మండలంలోని గరుడుబిల్లి - బొండపల్లి గ్రామాల మధ్య గల రైలుపట్టాలపై గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు గురువారం గుర్తించి రైల్వే పోలీసులకు తెలియజేశారు. వెంటనే వారు సంఘటనా స్థలానికి చేరుకుని రైలు ఢీ కొనడంతో మృతి చెంది ఉంటాడని భావించి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేంద్ర సర్వజన ఆస్పత్రికి తరలించారు. మృతుడి వయసు సుమారు 55 సంవత్సరాలు ఉంటాయని పోలీసులు తెలిపారు. మృతుని ఆచూకీ తెలిసిన వారు 94906 17089, 90000 52651 నంబర్లను సంప్రదించాలని కోరారు.

పిడుగుపాటుతో మహిళ మృతి



సత్తెమ్మ (ఫైల్)

వంగర: మండల పరిధిలోని బంగారువలస గ్రామానికి చెందిన బౌరోతు సత్తెమ్మ (55) గురువారం పిడుగుపాటుతో మృతి చెందింది. బంగారువలస, రాజులగుమ్మడ గ్రామాల మధ్య బారికబంద ఆయకట్టు పొలంలో సత్మెమ్మ పనులు చేస్తుండగా... ఒక్కసారిగా పిడుగు పడడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. మృతురాలికి భర్త గంగరాజు, ఇద్దరు పిల్లలున్నారు.

ఎన్నికల నిర్వహణకు సర్వం సిద్ధం చేయాలి

- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ నిషాంత్‌కుమార్

పార్వతీపురం: సాధారణ ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేందుకు సర్వం సిద్ధం చేయాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి నిషాంత్ కుమార్ అన్నారు. ఎన్నికలకు సంబంధించి ఏర్పాట్లు పక్కాగా ఉండాలని స్పష్టం చేశారు. ఎన్నికల ఏర్పాట్లపై పార్వతీపురం మన్యం జిల్లా, అల్లూరి సీతారామ రాజు జిల్లాల సహాయ రిటర్నింగ్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో గురువారం ఆయన సమీక్షించారు. 13వ తేదీన జరిగే పోలింగ్‌కు సామగ్రి పంపిణీ, రవాణా, రూట్లు తదితర అంశాలపై దృష్టి సారించాలని సూచించారు. ఎక్కడా ఎటువంటి లోపాలు జరగకుండా అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. హింసాత్మక సంఘటనలకు తావులేకుండా అన్ని ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. రాజకీయ పార్టీలు ఎన్నికల కమిషన్ నిబంధనలు తు.చ తప్పక పాటించే విధంగా అవగాహన కల్పించాలని ఆదేశించారు. పోలింగ్ కేంద్రాల వద్ద వైద్య శిబిరం నిర్వహించాలని, అవసరమైన మందులు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, ఐవి ఫ్లూయిడ్స్ తదితర మందులు ఉంచాలని సూచించారు. వైద్య శిబిరం వద్ద ఒక ఏఎన్ఎం, ఆశ కార్యకర్త విధుల్లో ఉండాలని పేర్కొన్నారు. పోలింగ్ పూర్తి చేసుకుని తిరిగి వచ్చి సామగ్రి అప్పగించే సమయంలో నిర్దేశిత ఫారాలు, సామగ్రిని ఖచ్చితంగా తనిఖీ చేసి తీసుకోవాలని, స్ట్రాంగ్ రూంలలో ఈవీఎంలు భద్రపరచడంలో జాగ్రత్తలు వహించాలని స్పష్టం చేశారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జాయింట్ కలెక్టర్, అరకు పార్లమెంట్ నియోజకవర్గ సహాయ రిటర్నింగ్ అధికారి ఎస్ఎస్ శోభిక, జిల్లా రెవెన్యూ అధికారి జి కేశవ నాయుడు, కంట్రోల్ రూం ఇన్‌చార్జ్, ఎస్‌డీసీ ఆర్.వి సూర్య నారాయణ, ఏడు శాసన సభ నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు పాల్గొన్నారు.



నాడు మారిక గిరిజన గ్రామానికి దారి



నేడు గిరిజన గ్రామానికి వేస్తున్న రహదారి

గిరిజన ప్రజలకు.. మార్గం సుగమం

- కొండల మీదకు రూ.కోట్ల ఖర్చుతో రోడ్లు
- దశాబ్దాల కల సాకారం
- డోలీ కష్టాలకు చెక్

శృంగవరపుకోట: అడవితల్లి ఒడిలో కల్మషం లేకుండా బతుకుతున్న గిరిజనులకు వెలుగు 'దారి' కనిపిస్తోంది. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం వచ్చాక సంక్షేమ పథకాలు వారి ఇంటి తలుపు తట్టడమే కాదు... అటవీ ఉత్పత్తుల తరలింపునకు అనువుగా 'మార్గం' సుగమమవుతోంది. అభివృద్ధి, సంక్షేమ పాలన చేరువైంది. ప్రతీ గిరిజన గ్రామం ప్రగతి బాట పట్టింది. విద్య, వైద్య సదుపాయాలు చేరువయ్యాయి. డోలీ మోతలు దూరమయ్యాయి.

దారపర్తికి దారి ఇదిగో..

ఎస్.కోట మండలం దారపర్తి పంచాయతీలో గిరిశిఖర గ్రామానికి గతంలో రోడ్డు సదుపాయం లేదు. అత్యవసర వేళ డోలీ మోతలే గతి. గిరిజనుల డోలీ కష్టాలపై పత్రికల్లో పలు కథనాలు ప్రచురితమైనా ఒక్క నాయకుడు కూడా పట్టించుకున్న దాఖలాలు లేవు. ఇటువంటి పరిస్థితుల్లో 2019లో అధికారంలోకి వచ్చిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం గిరిపుత్రుల కష్టాన్ని గుర్తించి దబ్బగుంట నుంచి పల్లపుదుంగాడ వరకు రూ.4.89 కోట్లతో బీటీ రోడ్డును మంజూరు చేసింది. ప్రస్తుతం ఈ రోడ్డు పనులు శరవేగంగా జరుగుతున్నాయి. దారపర్తి పంచాయతీలో కొండపైన ఉన్న ఎనిమిది గ్రామాలకు కాలినడకన వెళ్లాల్సిందే. ప్రాణాల మీదికి వస్తే డోలీ మోసుకుంటూ మైదాన ప్రాంతానికి చేరుకోవాల్సిన దుస్థితి. అటువంటి గ్రామాలకు కూడా రోడ్లు వేయడంతో నేడు ఆటోలు, ట్రాక్టర్లు, టిప్పర్లు వంటి వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. పనులు పూర్తయితే రవాణా సౌకర్యాలు మరింత మెరుగుపడతాయని గిరిజనం సంతోషంగా చెబుతున్నారు. అలాగే మండలంలోని బొడ్డవర పంచాయతీ పరిధి బొడ్డవర – చిట్టంపాడు రోడ్డులో కొండపైన ఉన్న గిరిసీమల కోసం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రూ. 10.75 కోట్లు మంజూరు చేసింది. ఈ నిధులతో ఆయా గ్రామాల్లో రహదారి సౌకర్యాలు కల్పించనున్నారు.



నాడు దబ్బగుంట నుంచి పల్లపుదుంగాడకు వెళ్లే కొండదారి ఇలా..



నేడు దబ్బగుంట నుంచి పల్లపుదుంగాడకు వెళ్లే రహదారి

మా కష్టాలు తీరుతాయి



దబ్బగుంట నుంచి పల్లపుదుంగాడ రోడ్డు పూర్తయితే మా కష్టాలు తీరుతాయి. నిత్యావసర కొనుగోలుకు గాని, ఇతర ఏ అవసరాలకు మైదాన ప్రాంతానికి రావడానికి గతంలో చాలా ఇబ్బందులు పడ్డాం. ఇకపై ఆ కష్టాలుండవు. రోడ్డు ఏర్పాటు చేసిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి రుణపడి ఉంటాం.

– జన్ని సీతయ్య, పల్లపుదుంగాడ, ఎస్.కోట మండలం

గిరిజనుల కష్టాలు గుర్తించారు..



ఎస్.కోట ఎమ్మెల్యే నడుచుకుంటూ కొండమీదికొచ్చి మా ఇబ్బందులను గుర్తించారు. రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేశారు. అటవీశాఖ అనుమతులు లేవని ఇబ్బంది పెడితే ప్రభుత్వంలో మాట్లాడి అనుమతులు సాధించారు. రోడ్డు పూర్తయితే గిరిసీమలు అభివృద్ధి చెందుతాయి.

– జరతా గౌరీష్, ఏపీ గిరిజన సంఘ డివిజన్ బాధ్యుడు, దారపర్తి గ్రామం, ఎస్.కోట మండలం

పదేళ్ల తర్వాత పనులు..



మారిక రోడ్డుకు పదేళ్ల కిందట పనులు ప్రారంభించి రెండు కిలోమీటర్ల రోడ్డు వేశారు. ఫారెస్ట్ వాళ్లు అడ్డుచెప్పడంతో పనులు ఆగిపోయాయి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక మళ్లీ పనులు చేస్తున్నారు. రోడ్డు పూర్తయితే మా కష్టాలు తీరుతాయి.

– కిల్లో ఆనందరావు, మారిక గ్రామం, వేపాడ మండలం

మా తలరాతలు మారుతాయి..



ఇక్కడ పుట్టి ఇక్కడే పెరిగి కొండల్ని వదిలేసి కిందకి రాలేం. ఎవరికైనా ప్రాణాల మీదికొస్తే డోలీ తప్పనిసరి.. నిత్యావసర సరుకులు తెచ్చుకోవడానికి మైదాన ప్రాంతానికి రావడానికి ఎన్నో ఇబ్బందులు పడ్డాం. ఇకపై రోడ్డు పూర్తయితే మా తలరాతలు మారుతాయి.

– పాతపోయిన దేముడు, పాతమారిక గ్రామం, వేపాడ మండలం.

మారుతున్న మారిక తీరు..

వేపాడ మండలం కరకవలస పంచాయతీ పరిధిలోని గిరిశిఖర గ్రామం మారిక. 2012–13లో 10.60 కిలోమీటర్ల రోడ్డు కోసం రూ. 5 కోట్లు మంజూరు చేయగా.. వెంటనే రెండు కిలోమీటర్ల మేర రోడ్డు వేశారు. ఇంతలో మహానాయకుడు రాజశేఖరరెడ్డి మరణానంతరం ఆ పనులు ఆగిపోయాయి. తర్వాత టీడీపీ పాలనలో ఎవ్వరూ మారిక ఊసెత్తలేదు. 2019లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక మారిక విషయం వెలుగులోకి వచ్చింది. పాలకులు నిధులు మంజూరు చేయించడంలో సఫలీకృతులు కావడంతో రోడ్డు పనులు ప్రారంభమయ్యాయి. రోడ్డు పూర్తయితే పాత మారిక, కొత్త మారిక గ్రామాల తీరు మారడం ఖాయం.

పట్టించుకోని టీడీపీ నాయకులు

అటవీ శాఖ అనుమతుల పేరుతో మారిక రోడ్డు పనులు నిలిచిపోతే టీడీపీ నాయకులు పట్టించుకున్న పాపాన పోలేదు. అలాగే దారపర్తి రోడ్డుకు కూడా అటవీ శాఖ అనుమతులు నిరాకరించడంతో స్థానిక ఎమ్మెల్యే పట్టుబట్టి అధికారులతో మాట్లాడి అనుమతులు సాధించారు. దీంతో రోడ్డు పనులు ముమ్మరంగా సాగుతున్నాయి.

మోసకారులను నమ్మవద్దు..



ఆకులపేట వద్ద ఎంపీ బెల్లానకు హారతిస్తున్న మహిళలు

- ఎంపీ బెల్లాన చంద్రశేఖర్

చీపురుపల్లి: ఎన్నికల సమయాల్లో ప్రజలు ముందుకు వచ్చి మాయమాటలు చెప్పే మోసకారులను నమ్మవద్దని ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ అన్నారు. చీపురుపల్లి మేజర్ పంచాయతీ పరిధిలోని రెడ్డిపేట, కుమ్మరికాలనీ, హడ్కోకాలనీ, వంగపల్లిపేట, కొత్త అగ్రహారం, జి.అగ్రహారం, ఆకులపేట, తదితర ప్రాంతాల్లో గురువారం ఆయన పర్యటించి, ఉపాధి వేతనదారులతో మాట్లాడారు. ఈ నెల 13న జరగనున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటేసి ఎమ్మెల్యే అభ్యర్థిగా బొత్స సత్యనారాయణను, ఎంపీ అభ్యర్థిగా తనను గెలిపించాలని కోరారు. ఎంపీ బెల్లానకు మహిళలు హారతులు పడుతూ, విజయ తిలకం దిద్ది ఆశీర్వదించారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ జిల్లా యువజన విభాగం ఉపాధ్యక్షుడు బెల్లాన వంశీకృష్ణ, తదితరులున్నారు.

పోలీసుల డేగకన్ను

- ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైనప్పటి నుంచి రూ. 1.15 కోట్ల నగదు సీజ్
- రూ. 8.32 కోట్ల విలువైన 99 కిలోల బంగారం, వెండి స్వాధీనం
- లక్షలాది రూపాయల మద్యం సీజ్
- ఎన్నికలకు మూడు వేల మందితో పటిష్ట బందోబస్తు

విజయనగరం క్రైమ్: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు జిల్లా పోలీస్ యంత్రాంగం డేగకన్నుతో ప్రతి అంశాన్నీ క్షుణ్ణంగా పరిశీలిస్తోంది. నోటిఫికేషన్ విడుదలైనప్పటి నుంచి నేటి వరకు పోలీస్ అధికారులు, సిబ్బంది విధి నిర్వహణలో తలమునకలై ఉన్నారు. గ్రామాల్లో ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం, ఎన్నికల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ప్రత్యేక ప్రణాళికలు రూపొందించింది. జిల్లా వ్యాప్తంగా సుమారు 17వేల మందిపై సెక్షన్ 107, 110 సీఆర్‌పీసీ కింద బైండోవర్ కేసులు నమోదు చేసింది. జాతీయ రహదారులపై ఎక్కడికక్కడ వాహనాలను తనిఖీ చేస్తున్నారు. ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైనప్పటి నుంచి ఇప్పటివరకు సుమారు రూ. కోటీ 15 లక్షల 97 వేల నగదు సీజ్ చేసింది. అదేవిధంగా రూ. 8 కోట్ల 32 లక్షల 55 వేల విలువైన 99 కిలోల బంగారం, వెండి వస్తువులు స్వాధీనం చేసుకున్నారు. అలాగే రూ. 61 లక్షల విలువైన 17వేల 686 లీటర్ల మద్యం.. రూ. 30 లక్షల విలువైన 611 కిలోల గంజాయిని సీజ్ చేశారు. అదేవిధంగా పీడీఎస్ రైస్, గుట్కా వంటి వస్తువులను కూడా స్వాధీనం చేసుకున్నారు. ఎన్నికల ఉల్లంఘనలకు పాల్పడిన 59 మందిపై కేసులు నమోదుచేశారు.



వాహన తనిఖీలు చేపడుతున్న విజయనగరం డీఎస్పీ గోవిందరావు

మూడు వేల మంది బందోబస్తు

ఇదిలా ఉంటే ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు మూడువేల మంది పోలీసులతో బందోబస్తు నిర్వహించనున్నట్లు ఎస్పీ ఎం. దీపిక తెలిపారు. పోలింగ్ రోజున 144 సీఆర్‌పీసీ అమల్లో ఉన్నందున ఇద్దరు కంటే ఎక్కువ వ్యక్తులు గుంపులుగా ఉండరాదన్నారు. జిల్లా వ్యాప్తంగా ఇప్పటికే 1015 గ్రామాల్లో ఎన్నికల సమావేశాలు.. 149 గ్రామాల్లో ఫ్లాగ్‌మార్చ్‌లు నిర్వహించినట్లు చెప్పారు.

స్త్రీ, పురుష నిష్పత్తిలో తేడా తగ్గించాలి

- డీఎంహెచ్ఓ భాస్కరరావు

విజయనగరం ఫోర్ట్: స్త్రీ, పురుష నిష్పత్తిలో తేడాలను తగ్గించేందుకు కృషి చేయాలని డీఎంహెచ్ఓ ఎస్. భాస్కరరావు తెలిపారు. సమాజంలో రుగ్మతలను తలెత్తకుండా ఉండాలంటే స్త్రీ, పురుష నిష్పత్తి సమానంగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. లింగ నిర్ధారణను అరికట్టాలని, వీటికి పాల్పడే స్కానింగ్ సెంటర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గురువారం స్థానిక జిల్లా వైద్యారోగ్య శాఖ కార్యాలయంలో జిల్లా స్థాయి ఉప అడ్వైజరీ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భస్థ పిండ పక్రియ చట్టం – 1994 అమలుపై చర్చించారు.

ప్రోగ్రాం అధికారులు స్కానింగ్ సెంటర్లను విధిగా తనిఖీ చేయాలని సూచించారు. ఫెర్టిలిటీ కేంద్రాలు తప్పనసరిగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని స్పష్టం చేశారు. సమావేశంలో డీఎల్ఓ డాక్టర్ కె. రాణి, డీఐఓ డాక్టర్ రాణి, డిప్యూటీ డీఎంహెచ్ఓ సూర్యనారాయణ, ఘోషా ఆస్పత్రి డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ అరుణశుభశ్రీ, డాక్టర్ సుజాతదేవి, పబ్లిక్ ప్రాసిక్యూటర్ జయలక్ష్మి, నేచర్ సంస్థ ప్రతినిధి కృష్ణారావు, డెమో చిన్నతల్లి, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ భాస్కరరావు

వైఎస్సార్‌సీపీలో పలువురి చేరిక



నెల్లిమర్ల రూరల్: వైఎస్సార్‌సీపీలో చేరిన వారితో ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, తదితరులు

నెల్లిమర్ల రూరల్: మండలంలోని సతివాడ పంచాయతీ పరిధి మధుపాడలో యాదవ సామాజికవర్గానికి చెందిన 20 కుటుంబాలు టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీ తీర్థం పుచ్చుకున్నాయి. బుధవారం రాత్రి సతివాడలో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, ఎమ్మెల్సీ డాక్టర్ పెనుమత్స సురేష్‌బాబు సమక్షంలో వారంతా వైఎస్సార్‌సీపీ కండువాలు కప్పుకున్నారు. గ్రామానికి చెందిన దువ్వ లక్ష్మమప్పడు, నర్సింగరావు, పీతల తాత, నౌడగం సన్యాసి, జయరాం, బమ్మిడి గౌరి, తదితర కుటుంబాలు పార్టీలో చేరాయి. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బడ్డుకొండ అప్పలనాయుడు, ఎమ్మెల్సీ పెనుమత్స సురేష్‌బాబు మాట్లాడుతూ.. అర్హతే ప్రామాణికంగా అర్హులందరికీ ఎటువంటి తారతమ్యం లేకుండా సంక్షేమాన్ని అందజేశామని, త్వరలో జరగనున్న ఎన్నికల్లో ప్రజలంతా ఫ్యాన్ గుర్తుపై ఓటు వేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ అంబళ్ల సుధారాణి, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి అంబళ్ల శ్రీరాములనాయుడు, మండలాధ్యక్షుడు చనమళ్ల వెంకటరమణ, జెడ్పీటీసీ సభ్యుడు గదల సన్యాసినాయుడు, సర్పంచ్ రేవళ్ల శ్రీనివాసరావు, ఎంపీటీసీ సభ్యుడు రెడ్డి సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో చేరిన ఎల్.కోట యువత..

కొత్తవలస: మండలంలోని అర్డాన్నపాలెం గ్రామ సమీపంలో గల ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు క్యాంప్ కార్యాలయంలో ఎల్.కోటకు చెందిన యువత వైఎస్సార్‌సీపీలో చేరారు. విశ్వనాథ రాంబాబు, అల్లం హరి, సంఘం హరి, సి.సునీత్‌రాహుల్, చిక్కాల నవీన్, తదితర 20 కుటుంబాలకు చెందిన యువకులు జెడ్పీటీసీ సభ్యురాలు తూర్పాటి వరలక్ష్మి, మాజీ సర్పంచ్ జేడీకే అప్పలరాజు, శ్రావణ్‌కుమార్, నీటిసంఘ మాజీ అధ్యక్షుడు జామి అప్పలరాజుల నేతృత్వంలో పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఎమ్మెల్యే కడుబండి వీరందరికీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో కొత్తవలస మార్కెటింగ్ కమిటీ డైరెక్టర్ కొట్యాడ శ్రీనివాసరావు, ఉప సర్పంచ్ జామి శ్రీరామమూర్తి, తదితరులు పాల్గొన్నారు.



కొత్తవలస: ఎమ్మెల్యే సమక్షంలో పార్టీలోకి చేరిన ఎల్.కోట యువత

విశ్రాంత ఉద్యోగులకు అండగా ఉన్నాం



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ ఉత్తరాంధ్ర డిప్యూటీ కో ఆర్డినేటర్ మజ్జి శ్రీనివాసరావు

చీపురుపల్లి: ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగులకు నిరంతరం అండగా ఉన్నామని, భవిష్యత్‌లో కూడా అలాగే ఉంటామని వైఎస్సార్‌సీపీ ఉత్తరాంధ్ర డిప్యూటీ కో ఆర్డినేటర్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. పట్టణంలోని ఏపీ విశ్రాంత ఉద్యోగుల భవనంలో గురువారం విశ్రాంత ఉద్యోగులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశ్రాంత ఉద్యోగుల సంక్షేమానికి ప్రభుత్వం కృషిచేసిందన్నారు. మేధావులైన విశ్రాంత ఉద్యోగులు మంచి ఆలోచన చేసి, రాష్ట్ర భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని ఓటు హక్కు వినియోగించుకోవాలని కోరారు. ఓట్లు, అధికారంతో సంబంధం లేకుండా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చేయగలిగిన హామీలు మాత్రమే మేనిఫెస్టోలో చేర్చి నిజాయితీను చాటుకున్నారని గుర్తు చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ఇప్పిలి అనంతం, వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, మీసాల వరహాలనాయుడు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

డెంకాడ: చింతలవలస ఐదో ఏపీఎస్పీ బెటాలియన్‌లో ఉన్న ఎస్‌పీఎస్ ఇంగ్లిష్ మీడియం ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుల పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు బెటాలియన్ కమాండెంట్ గౌతమిషాలి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 1 నుంచి 5వ తరగతి వరకు బోధించేందుకు ఇంగ్లిష్, సైన్స్ సబ్జెక్టుల్లో రెండు పోస్టులు ఖాళీగా ఉన్నట్లు పేర్కొన్నారు. అలాగే ఆరు నుంచి పదోతరగతి వరకు బోధించేందుకు బయాలజీ, ఫిజికల్ సైన్స్ సబ్జెక్టుల్లో రెండు పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఈ నెల 16వ తేదీ లోపు దరఖాస్తుతో పాటు బయోడేటా, విద్యార్హత పత్రాలను జత చేసి పాఠశాలలో అందజేయాలని కోరారు. ఇంకా మరింత సమాచారం కోసం ప్రధానోపాధ్యాయుడు టి.అప్పారావు (సెల్: 95731 84185)ను సంప్రదించాలన్నారు.

చంద్రబాబు సభకు జనం కరువు

- బాబును హెలీప్యాడ్ వద్దే వెయిట్ చేయించిన నాయకులు
- టీడీపీ అధినేత ప్రసంగిస్తుండగానే వెనుదిరిగిన ప్రజలు

చీపురుపల్లి: సార్.. కొంచెం ఆగండి.. ఇంకా జనం పూర్తిగా చేరుకోలేదు.. అందరికీ ఫోన్‌లు చేస్తున్నాం, వచ్చేస్తున్నారు... అంటూ స్థానిక టీడీపీ నేతలు బతిమాలడంతో హెలీప్యాడ్ వద్దనే ఉన్న బస్సులోనే చంద్రబాబు దాదాపు 40 నిమిషాలు ఉండిపోవాల్సి వచ్చింది. ఇదీ టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు ప్రజాగళం ఎన్నికల ప్రచార సభ దుస్థితి. పద్నాలుగు సంవత్సరాలు ముఖ్యమంత్రిగా చేసి.. జాతీయ, ప్రాంతీయ పార్టీల కూటమి కట్టిన చంద్రబాబునాయుడు చీపురుపల్లి వస్తే జనం లేక ఆయనే కాసేపు వెయిట్ చేయాల్సివచ్చింది. గురువారం సాయంత్రం పట్టణంలోని వంశీ విష్ణు థియేటర్ సెంటర్‌లో మధ్యాహ్నం 3 గంటలకు చంద్రబాబు ప్రజాగళం సభ ఏర్పాటు చేశారు. చంద్రబాబు 4.05 గంటలకు హెలీప్యాడ్ వద్దకు చేరుకున్నారు. అప్పటికి కనీసం ఐదువేల మంది కూడా లేకపోవడంతో స్థానిక టీడీపీ నాయకులు టెన్షన్ పడ్డారు. చంద్రబాబు కాసేపు వెయిట్ చేసి సభా ప్రాంగణానికి చేరుకున్నారు. అయితే టీడీపీ అధినేత మాట్లాడుతుండగానే.. ప్రజలు లేచి వెళ్లిపోయారు. రొటీన్ స్పీచ్ కావడంతో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తల నుంచి కూడా పెద్దగా స్పందన రాలేదు.



చంద్రబాబు సభకు అరకొరగా హాజరైన ప్రజలు

ఓటుహక్కు వినియోగించుకుందాం



పాటను విడుదల చేస్తున్న చౌదరి పురుషోత్తమనాయుడు

శ్రీకాకుళం అర్బన్: ప్రతిఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలని ఏపీ ఎన్జీవో సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చౌదరి పురుషోత్తమనాయుడు అన్నారు. శ్రీకాకుళంలోని ఏపీ ఎన్జీవో కార్యాలయంలో గురువారం 'ఓటు.. విలువ తెలుసుకుందాం' అనే పాటను నగిరి కరుణాకర్ రచించగా, ఏపీ ఎన్జీవో సంఘ పలాస అధ్యక్షుడు బోనేల గోపాల్ ఆలపించారు. ఈ పాటను పురుషోత్తమనాయుడు ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఏపీ ఎన్జీఓ సంఘ జిల్లా అధ్యక్షుడు హనుమంతు సాయిరాం, సంఘ నాయకులు కంఠ జయరామ్, బొత్స శ్రీనివాసరావు, రాజ్‌కుమార్, చింతాడ రాజేష్, అజయ్ ఎర్రం నాయుడు, శ్రీరాములు, పలాస గ్రీన్ ఆర్మీ సభ్యులు నగిరి కరుణాకర్, పవన్ కందికుప్ప, సునీల్ పాల్గొన్నారు.

తూలుగులో పోలీసుల కవాతు



తూలుగు పంచాయతీలో పోలీసుల కవాతు

గార: మండలంలోని తూలుగు పంచాయతీలో గురువారం కేంద్ర రక్షణ బలగాలు, సివిల్ పోలీసులు సంయుక్తంగా పోలీసు కవాతు జరిపారు. ఎన్నికల సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు పాల్పడినా, ఎన్నికల విధులకు ఆటంకం కలిగించినా క్రమశిక్షణ చర్యలు తప్పవని గ్రామాల్లో జరిగిన కవాతులో ఎస్ఐ కె.కృష్ణప్రసాద్ అన్నారు. ప్రతి ఒక్కరూ సార్వత్రిక ఎన్నికలు సజావుగా జరిపేందుకు సహకరించాలని కోరారు.

ఉవ్వెత్తున ప్రచారం

ప్రచార పర్వం

ఎన్నికల ప్రచారాలు చివరి అంకానికి చేరుకుంటున్నాయి. అభ్యర్థులు సర్వశక్తులు ఒడ్డుతూ ప్రచారాలు చేస్తున్నారు. జనాలు కూడా వారికి బ్రహ్మరథం పడుతున్నారు.



కొత్తూరు : ఎమ్మెల్యే రెడ్డి శాంతిని గజమాలతో సత్కరిస్తున్న దృశ్యం



సంతబొమ్మాళి: ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న శ్రీకాకుళం ఎంపీ అభ్యర్థి పేరాడ తిలక్‌కు విజయ తిలకం దిద్దుతున్న మహిళ



శ్రీకాకుళం దమ్మలవీధిలోని ప్రచారంలో మాట్లాడుతున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు



రణస్థలం: పాతర్లపల్లిలో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే కిరణ్ కుమార్



కాశీబుగ్గ: మందస సెంటర్‌లో మాట్లాడుతున్న మంత్రి సీదిరి అప్పలరాజు



కోటబొమ్మాళి: జర్జంగి గ్రామంలో ఎన్నికల ప్రచారంలో డ్యాన్స్ చేస్తున్న దువ్వాడ శ్రీనివాస్



పొందూరు: లోలుగులో చైతన్యరథంపై నుంచి మాట్లాడుతున్న స్పీకర్ తమ్మినేని సీతారాం



ఇచ్ఛాపురం రూరల్: ఈదుపురంలో ప్రచార వాహనంలో ఎన్నికల ప్రచారం చేస్తున్న వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పిరియా విజయ

'ఎన్నికల భారతం' కవితా సంకలనం ఆవిష్కరణ

శ్రీకాకుళం కల్చరల్: అభ్యుదయ రచయితల సంఘం రాష్ట్ర శాఖ ప్రచురించిన 'ఎన్నికల భారతం' కవితా సంకలనం పుస్తకాన్ని గురువారం శ్రీకాకుళం నగరంలోని గరిమెళ్ల ప్రెస్ క్లబ్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రముఖ కథా రచయిత అట్టాడ అప్పలనాయుడు మాట్లాడుతూ జీవితం, రాజకీయం వేర్వేరు కాదన్నారు. ఎన్నికల పట్ల సమాజ స్పందనలను తెలియచేయడం కవులు, రచయితల బాధ్యతని పేర్కొన్నారు. అరసం రాష్ట్ర అధ్యక్ష వర్గ సభ్యుడు నల్లి ధర్మారావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ప్రజా న్యాయవాది, సీనియర్ ఉద్యమ నాయకులు బొడ్డేపల్లి మోహనరావు, తెరవే జిల్లా అధ్యక్షుడు ఉత్తరావిల్లి నాగేశ్వరరావు, హిందీ ప్రచార పరిషత్ ఉత్తరాంధ్ర నాయకులు కోనే శ్రీధర్, యువ కవులు కంచరాన భుజంగరావు, కలమట దాసుబాబు, ఏపీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు చింతాడ అప్పలనాయుడు, సామ్నా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎం.వి.మల్లేశ్వరరావు, జిల్లా అధ్యక్షులు ఎస్.నవచైతన్య, ఇస్కఫ్ జిల్లా అధ్యక్షుడు జి.వి.నాగభూషణరావు తదితరులు పాల్గొన్నారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న రచయితలు

ముందస్తు ఏర్పాట్లు పూర్తి చేశాం: కలెక్టర్

శ్రీకాకుళం పాతబస్టాండ్: సాధారణ ఎన్నికల నిర్వహణకు సర్వ సన్నద్ధంగా ఉన్నామని కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ తెలిపారు. ఈ నెల 13 న రాష్ట్రంలో సాధారణ ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో.. ఎన్నికల నిర్వహణకు 72 గంటల ముందు చేయాల్సిన ఏర్పాట్లు, బందోబస్తు విస్తరణ ప్రణాళిక అమలు అంశాలపై జిల్లా ఎన్నికల అధికారులు, ఎస్పీలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా సమీక్ష నిర్వహించారు. శ్రీకాకుళం కలెక్టరేట్ హాల్ నుంచి హాజరైన జిల్లా ఎన్నికల అధికారి మనజీర్ జిలానీ సమూన్, జిల్లా ఎస్పీ జీఆర్ రాధికతో కలసి మాట్లాడారు. శాంతి భద్రతల నిర్వహణ, బందోబస్తు ఏర్పాట్లు, పోలింగ్ కేంద్రాల్లో కనీస మౌలిక వసతి సదుపాయాలు, పోలింగ్ సిబ్బంది వివరాలు, వెబ్ కాస్టింగ్, ఎలక్ట్రోల్ రోల్, పోలింగ్ సిబ్బందికి వాహనాల ఏర్పాటు తదితర అంశాలపై తీసుకున్న చర్యలను కలెక్టర్ ఈ సందర్భంగా వివరించారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Survey no 125/P, Etcherla Village & Mandal, Srikakulam Dist - 532402. and Pulished at Survey No. 125/P, Etcherla Village & Mandal, Srikakulam Dist - 532402.
Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 08942-281444, 499, 466 Fax No. 08942-281666 RNI Regn No. APTEL/2008/23798.